క్లుప్తంగా

హమాలీలకు ఈ-శ్రమ్ కేంద్రం ఏర్పాటు



లీగల్ సర్వీస్ క్యాంప్‌లో సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు, అధికారులు

కర్నూలు (లీగల్) : నగరంలోని హమాలీలకు స్థానిక మార్కెట్ యార్డులో ఈ-శ్రమ్, పీఎంఎస్‌వైఎం నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో జిల్లా కమిషనర్ ఆఫ్ లేబర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సాంబ శివుడు, లేబర్ ఆఫీసర్ శ్రీలక్ష్మి శనివారం పలువురు హమాలీలతో ఈ-శ్రమ్ కార్డులకు దరఖాస్తు చేయించారు. అదే విధంగా న్యాయానికి సంబంధించిన స్టాళ్లను ఏర్పాటు చేశారు. దీనివల్ల ప్రతి ఒక్కరికీ ఉచితంగా ఎలా న్యాయ సహాయం పొందాలి, ఎలా సంప్రదించాలి అనే విషయాలను పారా లీగల్ వలంటీర్లు వివరించారు.

కుటుంబాలను కలిపేలా కౌన్సెలింగ్

కర్నూలు : చిన్నచిన్న సమస్యలు, కారణాలతో దూరమైన భార్యాభర్తలను కలిపేలా ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు దిశ మహిళా పీఎస్ డీఎస్పీ ఐ.సుధాకర్‌రెడ్డి అన్నారు. వివిధ కారణాలతో పోలీసులను ఆశ్రయించిన జంటలకు శనివారం దిశ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. కలసి ఉంటేనే కుటుంబాలు బాగుంటాయని, క్షణికావేశంలో తల్లిదండ్రులు తీసుకునే నిర్ణయాలతో పిల్లలు అనాథలు కాకూడదని జంటలకు సూచించారు. చిన్నపాటి కారణాలతో విడిపోకూడదని, సర్దుకుపోతేనే జీవితం సాఫీగా సాగుతుందన్నారు. సీఐ లక్ష్మయ్య, మహిళా ఎస్‌ఐ ఆశాలత, సిబ్బంది రామరాజు, నజీర్, రమాబాయి, పుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనగర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థ పరిధిలోని 23 వ వార్డు శ్రీరామనగర్‌లో శనివారం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కటారి సురేష్ కుమార్ కాలనీలో రూ. 15 లక్షలతో సీసీ రోడ్డు, రూ.20 లక్షలతో డ్రెయినేజీ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్లమ్ కాలనీగా ఉన్న ఈ వార్డును గత పాలకులు పట్టించుకోలేదన్నారు. నగరపాలక వర్గం వచ్చిన రెండున్నర ఏళ్లలో రూ.1.40 కోట్లు విలువ చేసే అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసినట్లు చెప్పారు. సచివాలయాల పరిధిలో వచ్చిన నిధులు, గడప గడపకు మన ప్రభుత్వం కింద ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో ఈ అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కటారి పల్లవి, మాజీ కార్పొరేటర్ ఎంపీ రమణ, స్థానిక నాయకులు ఈశ్వరయ్య, పోలీసు జాన్, టీచర్ ప్రసాద్, ప్రశాంత్,వార్డు ప్రజలు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

కర్నూలు (టౌన్) : నగరంలో తాగునీటి సరఫరాకు ఆదివారం అంతరాయం కలగనున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ తెలిపారు. నగరశివారులోని మునగాలపాడు సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌లో పడి శనివారం ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని వెలికితీసేందుకు అశోక్‌నగర్ ఫిల్టర్ బెడ్‌కు నీటి సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. దీని వల్ల నగరంలో నీటి సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఆయన వెల్లడించారు.

స్వీయ రక్షణకు యుద్ధకళలు అభ్యసించాలి

కర్నూలు (టౌన్) : స్వీయ రక్షణ కోసం మహిళలు, విద్యార్థినులు యుద్ధ కళలను అభ్యసించాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ విజయ మనోహరి అన్నారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో కిక్ బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు తమకు నచ్చిన క్రీడాంశంలో శిక్షణ తీసుకుని రాణించాలన్నారు. ప్రతిరోజు సాధన చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో పోటీల పరిశీలకులు చంద్రకాంత్, కిక్ బాక్సింగ్ సభ్యులు నరేంద్ర ఆచారి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు శ్రీచైతన్య విద్యార్థిని ఎంపిక



గౌతమిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రమాదేవి

కర్నూలు (టౌన్): ఈనెల 29 నుంచి నరసరావుపేటలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అండర్-17 క్రికెట్ పోటీలకు శ్రీచైతన్య విద్యార్థిని బి. గౌతమి ఎంపికయ్యింది. శనివారం పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి విద్యార్థినిని అభినందించి మాట్లాడారు. ఈనెల 25 వ తేదీన జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ ఎంపిక పోటీల్లో గౌతమి ప్రతిభ కనబరిచిందన్నారు. త్వరలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటాలన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని
- నాల్గో విడతలో 1,549 సంఘాలకు రూ. 9.41 కోట్లు మంజూరు
- సంతోషంతో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసిన పొదుపు మహిళలు



పొదుపు సంఘాల మహిళలకు మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రాష్ట్రంలో మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ 35వ వార్డులోని సుంకులమ్మ దేవాలయం దగ్గర మెప్మా అధికారుల ఆధ్వర్యంలో నాల్గో విడత వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వైఎస్ఆర్ ఆసరా పథకం కింద కల్లూరు అర్బన్ పరిధిలోని 16 వార్డులకు చెందిన 1,549 పొదుపు సంఘాల మహిళలకు మంజూరైన రూ. 9.41 కోట్ల చెక్కును అందజేశారు. అనంతరం ఆయన వారినుద్దేశించి మాట్లాడారు. పేదల అభ్యున్నతికి సీఎం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. నవరత్నాల పేరుతో వివిధ పథకాలను అందిస్తున్నారన్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు స్వయం సహాయక సంఘాల బ్యాంకు రుణాలను విడతల వారీగా ప్రభుత్వమే చెల్లించిందన్నారు. కల్లూరు అర్బన్‌లోని 16 వార్డులకు కలిపి మొత్తం నాలుగు విడతల్లో రూ. 37.64 కోట్ల రుణాలు మాఫీ చేశామన్నారు.

టీడీపీ నాయకులను నమ్మి మోస పోవద్దు

టీడీపీ నాయకులు చెప్పే అసత్యాలు, మాయమాటలను నమ్మి మోస పోవదని ఎమ్మెల్యే కాటసాని మహిళలకు సూచించారు. 2014లో టీడీపీ అధినేత చంద్రబాబును అనుభవం ఉన్న నాయకుడు అని అధికారం ఇస్తే పొదుపు సంఘాల మహిళలతో పాటు రాష్ట్రంలోని ప్రతి ఒక్కరినీ మోసం చేశారన్నారు. రుణమాఫీ చేయకుండా రైతులు, పొదుపు మహిళలను నట్టేట ముంచారన్నారు. తమ పార్టీ అధినేత వైఎస్ జగన్ ఇచ్చిన మాట తప్పరన్నారు. 2019 ఎన్నికల ముందు ఇచ్చిన ఇచ్చిన హామీలన్నీ ఈ నాలుగున్నరేళ్ల పాలనలో పూర్తిగా అమలు చేశామన్నారు. కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో ఫ్లైఓవర్ బ్రిడ్జి , కృష్ణానగర్ ఐటీసీ సర్కిల్ దగ్గర మరో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించడంతో పాటు చెన్నమ్మ సర్కిల్ నుంచి వివిధ కాలనీలకు వెళ్లే రోడ్లను విస్తరించామన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం వక్కెర వాగుపై బ్రిడ్జిని నిర్మించామన్నారు. హంద్రీ నదిలో పెరిగిన ముళ్ల కంపలు తొలగించామన్నారు. కల్లూరు అర్బన్‌లో తాగు నీటి సమస్య పరిష్కారం కోసం రూ. 125 కోట్లతో ఎనిమిది ఓహెచ్ఆర్ఎస్ ట్యాంక్‌లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టిన తమ ప్రభుత్వంపై టీడీపీ నాయకులకు మాట్లాడే అర్హతే లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీకే ప్రజలు పట్టం కడతారని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, అదనపు కమీషనర్ రామలింగేశ్వర్, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ మహేశ్వరరెడ్డి, స్థానిక కార్పొరేటర్ మాధురి, మెప్మా పీడీ నాగశివలీల, టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి, టీఎంసీ సుధాకర్, మురళీ, కల్లూరు అర్బన్ 16 వార్డుల కార్పొరేటర్లు, నాయకులు వీరయ్య, సుకుమార్, కర్నాటి పుల్లారెడ్డి, హనుమంతురెడ్డి, భీమాశంకర్‌రెడ్డి, బాలచంద్రారెడ్డి, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

సర్వాంగ సుందరంగా నగరం

- రూ.1000 కోట్లతో అభివృద్ధి పనులు
- నేడు కొండారెడ్డి బురుజు వద్ద లేజర్, మ్యూజికల్ షో
- కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



నూతన స్ప్రేయింగ్ మిషన్లను పరిశీలిస్తున్న మేయర్ రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్) : కర్నూలు నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శనివారం సాయంత్రం తన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత పాలకులు నగరాభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. 2019లో వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రగతి పనులు మొదలయ్యాయన్నారు. నాలుగేళ్లలో రూ.1000 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. పెద్ద ఎత్తున్న మౌలిక సదుపాయాల కల్పనతో పాటు గ్రీన్ సిటీ, క్లీన్ సిటీ, పార్కులను ముస్తాబు చేసినట్లు చెప్పారు. ఓర్వకల్లు కారిడార్, హైదరాబాద్-బెంగుళూరు హైవే అభివృద్ధితో కర్నూలులో పెద్ద ఎత్తున్న పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఏర్పడిందన్నారు. ప్రస్తుతం కర్నూలును టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు.

ఐకాన్‌గా కొండారెడ్డి బురుజు

ఎంతో చరిత్ర కలిగిన కొండారెడ్డి బురుజును కర్నూలు ఐకాన్‌గా తీర్చిదిద్దుతున్నట్లు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. ఆదివారం సాయంత్రం బురుజు వద్ద పార్కు, లేజర్ షో, మ్యూజికల్ షో, 3 డి లైట్, సౌండ్ షో నిర్వహిస్తున్నామన్నారు. దీంతో పాటు పలు అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ఇండియన్ ఐడల్ ఆదితి భవరాజ్, శ్రీనివాస్, దర్శిశెట్టి హాజరవుతున్నారన్నారు. వెలకమ్ డ్యాన్స్, కేరళ డ్రమ్స్, ఫైర్ వర్క్స్ తదితర కార్యక్రమాలు ఉంటాయని నగర ప్రజలు కుటుంబాలతో హాజరు కావాలన్నారు.

పార్టీలకు అతీతంగా పథకాలు

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ కింద బాధితులకు మంజూరైన రూ. 7,75000 చెక్కులను శనివారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.

➤నగరపాలక సంస్థ పరిధిలోని 46 వ వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్ నగరూరు శ్రీనివాసరావుతో కలిసి ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ పరిశీలించారు. త్వరితగతిన డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

➤స్థానిక 13 వ వార్డు బంగారు పేటలో కర్నూలు ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. మురుగు కాల్వల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. కార్యక్రమంలో స్థానిక వార్డు కార్పొరేటరు విజయలక్ష్మి, స్థాని పార్టీ నాయకులు క్రిష్ణ, లక్ష్మణ్, తిమ్మన్న, మైఖేల్, అరుణ్ పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

కర్నూలు (టౌన్): నగరపాలక పరిధిలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు నగర మేయర్ బీవై.రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శనివారం స్థానిక నగర పాలక కార్యాలయంలో రూ.5 లక్షలు వెచ్చించి నూతనంగా కొనుగోలు చేసిన స్ప్రేయింగ్ మిషన్లను వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, కార్పొరేటర్ కృష్ణకాంత్ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు నయిమ్‌బాషా, గద్దం రామక్రిష్ణ, హాకీమ్ తదితరులు పాల్గొన్నారు.

టీజీ ఫ్యాక్టరీతో ఆరోగ్య సమస్యలు

టీజీ ఫ్యాక్టరీ వెదజల్లె దుర్వాసనతో ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఎమ్మెల్యే అన్నారు. ఈ విషయాన్ని పట్టించుకోని టీజీ హైపో ద్రావణాన్ని ఉచితంగా ఇస్తున్నట్లు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.శనివారం ఆయన తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ నగరంలో దోమల నివారణకు తాము ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

శంకర మందిరంలో మాజీ ఎంపీ పూజలు



మందిరంలో బుట్టా రేణుక దంపతులు

కర్నూలు కల్చరల్ : కర్నూలు ఓల్డ్‌సిటీలోని శంకర మందిరంలో మాజీ ఎంపీ బుట్టా రేణుక కుటుంబ సభ్యులతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం మఠాన్ని సందర్శించిన ఆమెను, ఆమె కుటుంబ సభ్యులను మఠం పండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. అనంతరం ఆమె అక్కడ నిర్వహిస్తున్న వేద పాఠశాలను సందర్శించి వేదం అభ్యసిస్తున్న విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సహాయ కమిషనర్ ఎం.రామాంజనేయులు, కరివెన నిత్యాన్నదాన సత్రం కార్యదర్శి డాక్టర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

29న పీసీసీ అధ్యక్షురాలు షర్మిళ రాక

కర్నూలు(సెంట్రల్): ఈనెల 29వ తేదీన పీసీసీ అధ్యక్షురాలు షర్మిళ కర్నూలుకు రానున్నట్లు కర్నూలు, నంద్యాల జిల్లాల డీసీసీ అధ్యక్షులు కె.బాబురావు, జె.లక్ష్మీ నరసింహయాదవ్ తెలిపారు. శనివారం రాత్రి డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 29వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ఆమె కర్నూలులోని నంద్యాల చెక్‌పోస్టుకు చేరుకుంటారని, అక్కడి నుంచి ర్యాలీగా వెంకటరమణ కాలనీలోని తనిస్క్ ఫంక్షన్ హాలుకు చేరుకుంటారన్నారు. అక్కడ జరిగే కర్నూలు,నంద్యాల జిల్లాల విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించనున్నట్లు చెప్పారు.

శ్రీకృష్ణదేవరాయల జయంతిని అధికారికంగా నిర్వహించాలి



శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాల వేస్తున్న నేతలు

కర్నూలు (అర్బన్) : విజయనగర సామ్రాజ్యాన్ని ఏలిన శ్రీకృష్ణ దేవరాయల జయంతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని కాపు, బలిజ సంఘం నేతలు కోరారు. శ్రీకృష్ణదేవరాయల 554వ జయంతి సందర్భంగా శనివారం స్థానిక జీజీ హాస్పిటల్ సర్కిల్‌లో రాయల విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయల పరిపాలన కాలంలో రాయలసీమలో రతనాలను రాసులుగా పోసి అమ్మేవారన్నారు. శ్రీకృష్ణదేవరాయల పరిపాలనను స్ఫూర్తిగా తీసుకుని నేటి పాలకులు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో అణచివేతకు గురవుతూ వస్తున్న కాపు, బలిజ కులస్తులు ప్రస్తుత పరిస్థితుల్లో ఐక్యంగా రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కొట్టె చెన్నయ్య, ఆర్జా రామకృష్ణ, కోనేటి వెంకటేశ్వర్లు, చింతలపల్లి రామకృష్ణ, మల్లికార్జున, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట


- మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ



అవగాహన సదస్సును జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ భార్గవ తేజ

కర్నూలు: సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవడం ద్వారానే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చునని కర్నూలు మున్సిపల్ కమిషనర్ భార్గవ తేజ అన్నారు. సైబర్ నేరాలు అరికట్టే విధానంపై విస్తృత అవగాహన కల్పించేందుకు కర్నూలు సీఐడీ ప్రాంతీయ అధికారి ఆధ్వర్యంలో శనివారం పుల్లారెడ్డి కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇన్ఫోసెక్ ఎస్ కాంప్లీ సొల్యూషన్స్ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భార్గవ తేజతో పాటు సీఐడీ అధికారి ఎస్ఏ స్వామి, డీఎస్పీ లక్ష్మీనారాయణ, సైబర్ సెక్యూరిటీ ఎక్స్‌పర్ట్ నరసింహారావు, పుల్లారెడ్డి కాలేజ్ డీన్ వెంకటమోహన్‌రెడ్డి తదితరులు హాజరై సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మొదటి సెషన్‌కు హాజరైన నగరపాలక కమిషనర్ మాట్లాడుతూ చదువుకున్న వారు సైతం ఆన్‌లైన్ మోసాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన మోసాల్లో బాధితులు ఎక్కువ శాతం మంది విద్యావంతులే ఉన్నారన్నారు. నేరాలను అరికట్టేందుకు పోలీసులు ఎంత అప్రమత్తంగా ఉంటారో సామాన్య పౌరులు కూడా అదే స్థాయిలో ఉండాలని సూచించారు. మారుతున్న సాంకేతిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. యువత క్రికెట్ బెట్టింగ్‌ల జోలికి పోరాదని పలువురు వక్తలు హితవు పలికారు. మోసాలు జరిగినప్పుడు టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని, సైబర్ క్రైం విభాగంలో రిపోర్టు చేయాలని సూచించారు. కార్యక్రమం ఉద్దేశం, ఇతర వివరాలను సీఐడీ డీఎస్పీ లక్ష్మీనారాయణ వివరించారు. ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాలకు చెందిన పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు, మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగులతో పాటు విద్యార్థులు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ ఉద్యోగులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఐలు డేగల ప్రభాకర్, ప్రసాదరావు, శ్రీధర్, నగేష్ బాబు, కౌలుట్లయ్య, ఖాదర్ బాషా, శ్రీనివాసులు, దస్తగిరితో పాటు పలువురు ఎస్‌ఐలు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం పట్టివేత



అక్రమ మద్యం రవాణాదారులను అరెస్టు చూపుతున్న సెబ్ పోలీసులు

కర్నూలు : స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తనిఖీల్లో 80 తెలంగాణ మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. కర్నూలు డీటీఎఫ్ సీఐ నర్సానాయుడు, సెబ్ సీఐ కేఆర్ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం మునగాలపాడు గ్రామ శివారులో వాహన తనిఖీ చేపట్టారు. తెలంగాణ రాష్ట్రంలోని పుల్లూరు టోల్‌ప్లాజా వైపు నుంచి మునగాలపాడుకు వెళ్తున్న ఆటోను ఆపి తనిఖీ చేయగా అందులో 80 మద్యం బాటిళ్లు బయటపడ్డాయి. ఆటోలో ఉన్న మునగాలపాడు గ్రామానికి చెందిన మునికుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా టోల్‌ప్లాజా గేటు వద్ద ఉన్న మద్యం షాపు నుంచి కొనుగోలు చేసి మునగాలపాడుకు తీసుకెళ్తున్నట్లు అంగీకరించాడు. దీంతో అతనిపై కేసు నమోదు చేసి మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు కర్నూలు సెబ్ సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐలు మారుతి ప్రసాద్, వీరస్వామితో పాటు సిబ్బంది షేక్షావలి, సుదర్శన్ రాజు, బషీర్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి



క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: క్రీడల్లో గెలుపు ఓటములను క్రీడాకారులు సమానంగా స్వీకరించాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ఓర్వకలు మండల కేంద్రంలో జరుగుతున్నాయి. శనివారం క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో గడివేముల జట్టుపై కల్లూరు అర్బన్ 21వ వార్డుకు చెందిన 54వ వార్డు సచివాలయం జట్టు విజయం సాధించింది. ఎమ్మెల్యే కాటసాని, డిప్యూటీ మేయర్ రేణుక, స్థానిక కార్పొరేటర్ అరుణ ఆ జట్టు క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో బాలచంద్రారెడ్డి, సుకుమార్, భీమాశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవీ-ఇవీ

30న దీక్షాధారుల సమ్మేళనం

కర్నూలు కల్చరల్: వికాస భారతి ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఓర్వకల్ మండలం కాల్వ బుగ్గ సమీపంలోని సురభి గోశాలలో వివిధ దేవీ దేవతల దీక్షాధారుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ సమన్వయకర్త పోచా మహేశ్వరరెడ్డి తెలిపారు. భారతీయ స్ఫూర్తి కేంద్రం అధ్యక్షుడు హుసేన్ రెడ్డి అధ్యక్షతన జరిగే సమ్మేళనంలో వికాస భారతి సంఘటనా కార్యదర్శి బీవీ నాగేంద్రప్రసాద్ ముఖ్య వక్తగా హాజరై ప్రసంగిస్తారని, చాగలమర్రి శివానంద ఆశ్రమానికి చెందిన పూజ్య శ్రీ అభినవ శంకరానందగిరి స్వామి వారు ఆశీర్వచన ప్రసంగం చేస్తారని పేర్కొన్నారు. వివరాలకు 94932 54266 నెంబర్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

కురువలకు ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు కేటాయించండి

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలో త్వరలో జరగనున్న లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో కురువులకు ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు కేటాయించాలని కురువ, మదాసి/ మదారి కురువ పొలిటికల్ జేఏసీ నేతలు కోరారు. శనివారం స్థానిక బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో జేఏసీ చైర్మన్ రవికుమార్, వైస్ చైర్మన్లు కురువ శ్రీనివాసరావు, కురువ బలరాం, మదాసి కురువ సుంకన్న, బత్తిన కిరణ్‌కుమార్, శివలింగం, సీజీ శివయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో అతి పెద్ద సామాజిక వర్గాల్లో ఒకటైన కురువలకు అన్ని పార్టీలు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. తమ సామాజిక వర్గానికి కర్నూలు పార్లమెంట్ స్థానంతో పాటు రెండు ఎమ్మెల్యే స్థానాలు కేటాయించాలన్నారు. సమావేశంలో నాయకులు సురేంద్ర, పరశురాముడు, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఎలక్ట్రీషియన్లను ఆదుకోవాలి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని ప్రైవేటు ఎలక్ట్రీషియన్లను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.పాల్‌రాజ్ తెలిపారు. శనివారం కర్నూలులోని పాత బస్టాండ్ ప్రాంతంలో ఎలక్ట్రీషియన్ డే నిర్వహించారు. ఈ సందర్భగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాల్‌రాజ్ అసోసియేషన్ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చక్రి, కోశాధికా రి బూషణం, ఇతర నాయకులు శివశంకర్, అమీర్‌బాషా, వెల్దుర్తి మండల నాయకులు ఏసు, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

డైట్ కాలేజీలో డీఈఓకు సన్మానం

కర్నూలు సిటీ: ప్రభుత్వ డైట్ కాలేజీలో శనివారం డీఈఓ డా.వి. రంగారెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ వసుంధర, డైట్ లెక్చరర్లు గోవిందు, షంషుద్దీన్, జనార్దన్ రెడ్డి, అయూబ్, తదితరులు పాల్గొన్నారు.

ఒప్పందాలకు జీఓలు విడుదల చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఇటీవల మునిసిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె సందర్భంగా ప్రభుత్వం అంగీకరించిన ఒప్పందాలకు జీఓలు రూపొందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. శనివారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..జీఓ నంబర్ 12 ప్రకారం మునిసిపల్ కార్మికులకు సంక్రాంతి కానుకగా రూ.1000 ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు విజయ్, నరసింహులు, కుమార్, రాజేష్, షఫీ, శ్రీను, అశోక్,మద్దిలేటి, సుధాకర్ పాల్గొన్నారు.

ఆర్‌యూ నాన్‌టీచింగ్ సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలోని నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాయలసీమ యూనివర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఐదేళ్లు పూర్తి చేసుకున్న నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అందరికీ టైం స్కేల్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల నుంచి తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఖాళీగా ఉన్న రెగ్యులర్ నాన్ టీచింగ్ పోస్టులను సీనియారిటీ ప్రకారం భర్తీ చేయాలని వర్సిటీ క్యాంపస్‌లో క్యాంటీన్ ఏర్పాటు చేయాలని వీసీ దృష్టికి తీసుకెళ్లారు. సంఘం అధ్యక్షుడు భాస్కర్‌రావు, ప్రధాన కార్యదర్శి రమేష్, కోశాధికారి లక్ష్మన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణవేణి, సంయుక్త కార్యదర్శులు కిరణ్మయి, రాజు తదితరులు వీసీకి వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

అశోకాలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

కల్లూరు: దూపాడు సమీపంలోని అశోకా మహిళ ఇంజినీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. శనివారం నిర్వహించిన వేడుకలకు రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ (వీసీ) డాక్టర్ సుధీర్ ప్రేమ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2022, 2023 సంవత్సరాలలో కోర్సు ముగించిన బి.టెక్, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేశారు.

చిన్నారులకు తప్పనిసరిగా టీకాలివ్వాలి

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు, చిన్నారులకు తప్పనిసరిగా టీకాలు ఇవ్వాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శనివారం ఆయన వడ్డేగేరి యూపీహెచ్‌సీలో నిర్వహిస్తున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేసి అక్కడి రికార్డులు, వ్యాక్సిన్ నిల్వ ఉండే శీతలీకరణ పరికరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పకుండా ఇవ్వాలని చెప్పారు. అనంతరం గర్భిణులు, బాలింతలతో ఆరోగ్య సేవల గురించి చర్చించారు. గర్భిణిలకు ఐరన్ మాత్రలు, బరువు, ఎత్తు తక్కువ ఉన్న పిల్లలకు ఐఎఫ్ఏ, విటమిన్-ఎ సిరప్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వడ్డేగేరి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకట ప్రవీణ్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌యూకు కాంస్య పతకం

కర్నూలు (టౌన్) : ఈనెనెల 26 నుంచి 29 వరకు ఛండీగఢ్ యూనివర్సిటీలోని మొహిలిలో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాయలసీమ యూనివర్సిటీకి చెందిన అబ్దుల్లా (కర్నూలు) 61 కిలోల బరువు విభాగంలో కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ సీవీ కృష్ణారెడ్డి శనివారం వర్సిటీ ప్రాంగణంలో మాట్లాడుతూ అఖిల భారత వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పతకం సాధించడం ఇదే తొలిసారి అని చెప్పారు. త్వరలో నిర్వహించనున్న ఖేలో ఇండియా యూనివర్సిటీ క్రీడల్లో స్వర్ణ పతకం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్, స్పోర్ట్స్ డైరెక్టర్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పద్యనాటక పోటీలకు 'శ్రీకృష్ణ కర్ణార్జునీయం'

కర్నూలు కల్చరల్: జాతీయ స్థాయి పద్య నాటక పోటీలకు కర్నూలు టీజీవీ కళాక్షేత్రం వారి 'శ్రీకృష్ణ కర్ణార్జునీయం' నాటకం ఎంపికైంది. ఈ విషయాన్ని మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం కన్వీనర్ కృష్ణమూర్తి తనకు తెలిపారని కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. కళా కేంద్రం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడలో మార్చి 30 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు జాతీయ స్థాయి పద్య, సాంఘిక నాటక పోటీలు జరగనున్నాయని తెలిపారు. ఈ పోటీలకు పద్య నాటక విభాగంలో తమ నాటకం శ్రీకృష్ణ కర్ణార్జునీయం ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల మొదటి వారం నుంచి నాటకాల ప్రాథమిక పరిశీలన జరిగిందని పేర్కొన్నారు. ఈ పద్య నాటకాన్ని పల్లేటి కులశేఖర్ రచించారని, తాను దర్శకత్వం వహించినట్లు పత్తి ఓబులయ్య తెలిపారు. జాతీయ పోటీలకు నాటకం ఎంపిక కావడంపై పలు కళా సంస్థలు, కళాకారులు హర్షం ప్రకటించారు.